సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 7 । అక్టోబర్ । 2022

బొర్రా గుహల టిక్కెట్ ధరలు పెంపు



అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహల ప్రవేశ టిక్కెట్ ధరలు పెరిగాయి. ప్రస్తుతం పెద్దలకు రూ.70, పిల్లలకు రూ.50 వసూలు చేస్తున్నారు.ఇప్పుడు ఈ ధరల్లో మార్పులు చేశారు. పెద్దల టిక్కెట్ ధర రూ.80కి, చిన్నారుల టిక్కెట్ ధర రూ.60కి పెంచారు. పెరిగిన టిక్కెట్ ధరలు గురువారం నుంచి అమలు చేస్తున్నట్టు బొర్రా యూనిట్ మేనేజర్ గౌరీశంకర్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టిక్కెట్ ధరలు పెంచినట్టు ఆయన తెలిపారు.

శక్తి స్వరూపిణికి బోనాల నివేదన

8లో



న్యూస్‌రీల్

విస్తృతంగా సచివాలయాల సేవలు

సబ్ కలెక్టర్ అభిషేక్



అనంతగిరి సచివాలయంలో తనిఖీ చేస్తున్న సబ్‌కలెక్టర్ అభిషేక్

అనంతగిరి: గ్రామాల్లో సచివాలయ సేవలను మరింత విస్తృతంగా అందజేయాలని సబ్‌కలెక్టర్ అభిషేక్ ఆదేశించారు. మండలంలోని అనంతగిరి, కొండిబ, బొర్రా, టోకూరు సచివాలయాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులందరికీ నవరత్నాలు పథకాలు అందేలా సిబ్బంది పని చేయాలన్నారు. స్పందన ఫిర్యాదులపై ఆరా తీశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సబ్‌కలెక్టర్ హెచ్చరించారు.

22,23 తేదీల్లో టెన్నిస్ లీగ్ జోనల్ చాంపియన్‌షిప్

సాక్షి,పాడేరు: రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ(శాప్) ఆదేశాల మేరకు ఈ నెల 22,23వ తేదీల్లో విజయనగరంలో టెన్నిస్ లీగ్ జోనల్ చాంపియన్‌షిప్ నిర్వహించనున్నట్టు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకులు ఎ.జగన్మోహనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-8,10,12,14,16,18 విభాగాల్లో బాలబాలికలకు ఈ పోటీలు నిర్వహిస్తామని, ఆయా క్రీడాకారులు శాప్‌లో రిజిస్టర్ అయి ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఏటీఎల్ యాప్‌లో గాని, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆంధ్రటెన్నిస్.ఇన్ వెబ్‌సైట్‌లోగాని ఈ నెల 16లోపు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఈ పోటీలను విజయనగరం జిల్లా బాబా మెట్టలోని విజ్జి స్టేడియంలో నిర్వహిస్తామని తెలిపారు. వివరాలకు కె.డానియెల్(ఫోన్ నంబర్ 9866863619)ను సంప్రదించాలని తెలిపారు

10న ఐటీఐలో అప్రెంటీస్‌షిప్ మేళా

కంచరపాలెం(విశాఖ ఉత్తర): విశాఖ జిల్లా పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ) కోర్సులు పూర్తి చేసి అప్రెంటిస్ చేయని వారి కోసం కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐ కళాశాల ఆవరణలో ఈ నెల 10 సోమవారం ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటీస్‌షిప్ మేళా-2022 నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్, జోన్-1 ఉప సంచాలకులు ఆర్‌పీ రమణ పేర్కొన్నారు. ఐటీఐ అన్ని ట్రేడుల అభ్యర్థులు అప్రెంటీస్‌షిప్ మేళాలో పాల్గొన వచ్చని సూచించారు. మేళాలో 25కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొని తమ సంస్థల్లో అవకాశం కల్పిస్తాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 10 సోమవారం ఉదయం 9 గంటలకు నేరు మేళా- 2022కు బయోడేటా, ధ్రువ పత్రాలతో హాజరు కావాలని కోరారు. ముందుగా https://dgt.govinappmela2022/candidate.registration.php ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

చింతపల్లి రూరల్: పురుగు మందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకొన్న సంఘటన గురువారం జరిగింది. జీకే వీధి మండలం గుర్రలగొంది కి చెందిన వంతల కొశం(45) కుటుంబ కలహాల కారణంగా బుధవారం రాత్రి పురుగు మందు తాగింది. ఆమెను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు వైద్య సిబ్బంది తెలిపారు. మృతురాలికి భర్త, ఆరుగురు పిల్లలు ఉన్నారు.

అడవి బిడ్డలకు అండగా..

- తక్కువ బరువు, ఎత్తు ఉన్న పిల్లలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులను గుర్తిస్తున్న ప్రభుత్వం
- 104 వాహనాలతో ప్రత్యేక వైద్య సేవలు
- అదనపు పౌష్టికాహారం అందజేత



ఈ చిత్రంలో ఉన్న బాలుడి పేరు ఎస్.లక్ష్మీనారాయణ. వయస్సు 2 సంవత్సరాల 5 నెలలు. బరువు 12.2 కేజీలు ఉండాలి, కానీ 8 కేజీలు మాత్రమే ఉన్నాడు. 4 కేజీలు తక్కువగా ఉండడంతో బరువు పెరిగేందుకు అంగన్‌వాడీ టీచర్ ప్రతి రోజు మంచి పౌష్టికాహారం అందిస్తూ ఇంటిలో తీసుకోవలసిన చర్యలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. 104 వైద్యులు సైతం ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహిస్తూ మందులు అందజేస్తున్నారు. గతంలో కేవలం పౌష్టికాహారం మాత్రమే అందించేవారని, ఇప్పుడు వైద్య సేవలు అందిస్తున్నారని బాలుడు తల్లి విజయలక్ష్మి తెలిపారు.

అధిక బరువు వల్ల ఎలాగైతే ఆరోగ్య సమస్యలు వస్తాయో, బరువు తక్కువగా ఉండడం వల్ల కూడా సమస్యలు ఉత్పన్నమవుతాయి. పిల్లల్లో పౌష్టికాహారం లోపిస్తే వారి శారీరక ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ఏజెన్సీలో బరువు, ఎత్తు తక్కువగా ఉన్న పిల్లల గుర్తింపు కార్యక్రమాన్ని నెల రోజులుగా నిర్వహిస్తున్నారు. తద్వారా పిల్లలకు సంపూర్ణ పౌష్టికాహారం, మందులు అందజేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది.

ముంచంగిపుట్టు: గిరిజన ప్రాంతంలో పౌష్టికాహార లోపంతో తక్కువ బరువు, తక్కువ ఎత్తు కలిగిన పిల్లలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఇలాంటి వారిని ఐసీడీఎస్ అధికారులు గుర్తిస్తున్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్ ద్వారా పిల్లల నెల వారీ ఎదుగుదలను అంగన్‌వాడీ కార్యకర్తలు నమోదు చేస్తున్నారు. గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు గ్రామాల్లోకి వెళ్లే 104 వాహనం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. 104 వైద్యాధికారులు పిల్లలను పరీక్షించి పిల్లల ఎదుగుదలకు అందజేయవలసిన ఆహారం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతో పాటు మందులు ఇస్తున్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల ఆరోగ్య వివరాలను తెలుసుకుంటున్న వైద్యాధికారి రమేష్

బరువు,ఎత్తుల నమోదు వేగవంతం

జిల్లాలో 19 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1791 మెయిన్,1423 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆరేళ్ల లోపు పిల్లలు 1,00,686 మంది ఉన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 85,411 మంది పిల్లల బరువు వివరాలు సేకరించారు. వీరిలో 18,526 మంది బరువు తక్కువగా ఉన్నారని గుర్తించారు.

వయసుకు తగ్గ బరువు లేని వారు 8,738 మంది ఉన్నారు. వయసుకు తగ్గ ఎత్తు లేనివారు 32,539మంది ఉన్నారు. సాధారణంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ప్రతీ నెలా బరువు,ఎత్తుల కొలతలు తీస్తారు.కానీ ప్రభుత్వం ఆదేశాలతో ఇప్పుడు ప్రతీవారం ప్రత్యేకంగా కొలతలు తీసి వారి ఎదుగుదలపై ఐసీడీఎస్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి,పర్యవేక్షిస్తున్నారు. ముఖ్యంగా పౌష్టిహారంతో కూడి భోజనం,104 ద్వారా మెరుగైన వైద్య సేవలందిస్తూనే ఇంకా అవసరమైన వైద్యం కోసం ఆరోగ్య కేంద్రాలకు తరలిస్తున్నారు.



ముంచంగిపుట్టులో అంగన్‌వాడీలో పిల్లల బరువు చూస్తున్న అంగన్‌వాడీ టీచర్

ప్రత్యేక దృష్టి



ఎత్తుకు తగ్గ బరువు, వయస్సుకు తగ్గ ఎత్తు, బరువు లేని పిల్లలపై ప్రత్యేక దృష్టిసారించి, వారానికోసారి కొలతలు తీసుకుంటున్నాం.జిల్లాలో 19 ప్రాజెక్టుల పరిధిలో 3,214 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. 85,411 మంది చిన్నారుల బరువు,ఎత్తు వివరాలు ఇప్పటికే నమోదు చేశాం. బరువు,ఎత్తు తక్కువ ఉన్న పిల్లల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలోని 11,460 మంది గర్భిణులకు,10,958 మంది బాలింతలకు సైతం ప్రభుత్వం అందించే పౌష్టికాహారం అందిస్తూ వారి ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చైతన్య పరుస్తున్నాం.

–ఎన్.సూర్యలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ

వికేంద్రీకరణపై కార్యాచరణ

- కీలక నేతల భేటీ
- రెండు రోజుల్లో జేఏసీ సమావేశం
- వివరాలు వెల్లడించిన మంత్రి అమర్‌నాథ్



మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): వికేంద్రీకరణకు మద్దతుగా ఒకటి రెండు రోజుల్లో కార్యాచరణ ప్రకటించేందుకు జేఏసీ సమావేశం అవుతుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. రైతుల పేరుతో రియల్టర్లు నిర్వహిస్తున్న పాదయాత్రపై చర్చించేందుకు వైఎస్సార్‌సీపీ ఉమ్మడి విశాఖ జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి నేతృత్వంలో స్థానిక సర్క్యూట్ హౌస్‌లో గురువారం ఉప ముఖ్య మంత్రి బూడి ముత్యాలునాయుడు, మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, ఉమ్మడి విశాఖ జిల్లాలకు చెందిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, తదితరులు సమావేశమయ్యారు. సమావేశంలో చర్చించిన అంశాలను మంత్రి అమర్‌నాథ్ మీడియాకు వివరించారు. వికేంద్రీకరణకు మద్దతు కోరుతూ ఈ నెల తొమ్మిదో తేదీన అల్లూరి సీతారామరాజు జిల్లాలో కూడా రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. వచ్చే వారంలో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో కూడా సమావేశం నిర్వహిస్తామన్నారు. టీడీపీ జెండాను వాళ్ల అజెండాగా మార్చుకుని, చంద్రబాబు భూములను కాపాడడం కోసం ఈ యాత్ర సాగిస్తున్నారని అమర్ అన్నారు. కోర్టు అనుమతితో సాగుతున్న ఈ పాదయాత్రకు ప్రభుత్వం భద్రత కల్పిస్తుందని ఆయన తెలిపారు. అయినప్పటికీ పాదయాత్రలో వాళ్లు తొడలు కొట్టి, సవాలు విసురుతూ ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలను దెబ్బతీస్తున్నారన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వికేంద్రీకరణ ద్వారా విశాఖను పాలనా రాజధానిగా చేయడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. దీనికి సంబంధించి ఏర్పాటు చేసిన జేఏసీ ఒకటి రెండు రోజుల్లో కార్యాచరణను రూపొందిస్తుందని, దాని ప్రకారం తామంతా నడుచుకుంటామని తెలిపారు. వికేంద్రీకరణకు మద్దతుగా పాదయాత్రలు, వార్డు స్థాయి సమావేశాలు, బైక్ ర్యాలీలు నిర్వహించే అవకాశం ఉందని అమర్‌నాథ్ విలేకరులు అడిగిన ఒక ప్రశ్నకు సమాధానం చెప్పారు.

దంచికొడుతున్న వానలు

జిల్లాలో 560.04 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు



జడ్డంగిలోని మదేరు ఆనకట్ట వద్ద ప్రవహిస్తున్న వరద నీరు

సాక్షి, పాడేరు/రాజవొమ్మంగి: జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల నుంచి వర్షాలు దంచికొడుతున్నాయి. ప్రధాన వాగులు, గెడ్డల్లో వరద నీరు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. జి.మాడుగుల నుంచి పాడేరు, పెదబయలు, హుకుంపేట, ముంచంగిపుట్టు మండలాల వరకు విస్తరించి ఉన్న మత్స్యగెడ్డలో వరద నీరు పోటెత్తుతోంది. పలు కాజ్‌వేలు మీదుగా నీరు ప్రవహిస్తుండడంతో గెడ్డ అవతల గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. హుకుంపేట, డుంబ్రిగుడ, అనంతగిరి, పెదబయలు, ముంచంగిపుట్టు, జి.మాడుగుల ప్రాంతాల్లో కూడా ప్రధాన గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.రాజవొమ్మంగి మండలం వట్టిగెడ్డ రిజర్వాయర్‌లోకి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ ప్రవాహం వల్ల శాంతినగర్, వయ్యేడు, ముర్లవానిపాలెం తదితర గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. జడ్డంగిలో మదేరు ఆనకట్టవద్ద వరద ఉధృతికి పెరుగుతోంది. ఈ ఆనకట్టకు గల ఆటోమేటిక్ షట్టర్లు అన్ని తెరుచుకుని ఏలేరు రిజర్వాయర్ వైపు వరద నీరు ప్రవహిస్తోంది. లోతట్టు ప్రాంతాలైన చికిలింత తదితర గ్రామాల్లో పూరిగుడిసెల్లోకి నీరు చేరడంతో గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 560.04 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పాడేరు, రంపచోడవరం డివిజన్ల భారీ వర్షాలు కురుస్తుండడంతో రెవెన్యూ యంత్రాంగాన్ని కలెక్టర్ సుమిత్ కుమార్ అప్రమత్తం చేశారు.



పాడేరులో కురుస్తున్న వర్షం

జిల్లాలో వర్షపాతం వివరాలు

అనంతగిరి మండలంలో 78.6 మిల్లీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైంది. కొయ్యూరులో 46.2, ఎటపాకలో 37.2, దేవీపట్నంలో 35.6, జి.కె.వీధిలో 34.2, అడ్డతీగలలో 31.8, అరకులోయలో 28.2, పెదబయలులో 24.6, పాడేరులో 24, రాజవొమ్మంగిలో 26.2, చింతపల్లిలో 22.4, మారేడుమిల్లిలో 22.2, వై.రామవరంలో 22.6, హుకుంపేటలో 21.6, వీఆర్‌పురంలో 22.6, కూనవరంలో 24, డుంబ్రిగుడలో 17.2, గంగవరంలో 14.2, రంపచోడవరంలో 4.2, జి.మాడుగులలో 15.8, ముంచంగిపుట్టులో 4.8, చింతూరులో 2.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు కలెక్టరేట్ అధికారులు తెలిపారు.

మూడు రాజధానులతోనే సమగ్రాభివృద్ధి

మద్దతుగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు



కనకదుర్గమ్మ విగ్రహానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, నర్సింగరావు దంపతులు



గంగమ్మతల్లికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పార్టీ నాయకులు



అడ్డతీగలలోని దేవీ ఆలయంలో పూజలు చేసిన ఎమ్మెల్యే ధనలక్ష్మి

సాక్షి,పాడేరు/అరకులోయ రూరల్/అడ్డతీగల/పెదబయలు/గంగవరం/హుకుంపేట: మూడు రాజధానుల ఏర్పాటుకు మద్దతు తెలుపుతూ, వాటికి ఎదురవుతున్న అడ్డంకులు తొలగిపోవాలని కోరుతూ జిల్లాలోని పలు ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలంటే వికేంద్రీకరణే మార్గమనీ.. విశాఖపట్నం,అమరావతి,కర్నూలు ప్రాంతాల్లో రాజధానులు ఏర్పాటు వేగవంతంగా జరిగేలా దీవించాలంటూ కనకదుర్గమ్మకు కోరుతూ ఎమ్మెల్యేలు కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, నాగులపల్లి ధనలక్ష్మితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు అర్చనలు జరిపారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు దంపతులు దుర్గమ్మకు ప్రత్యేక పూజలు జరిపారు. పాడేరు కాంప్లెక్సు రోడ్డులోని కనకదుర్గమ్మతల్లి ఆలయంతో పాటు మెయిన్ రోడ్డులోని దుర్గమ్మతల్లి ఉత్సవ విగ్రహాన్ని వారు దర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోనే అభివృద్ధి సాధ్యమన్నారు.

గంగమ్మతల్లి ఆలయం, చర్చిలో..

అరకులోయ మండలం యండపల్లివలసలోని గంగమ్మతల్లి ఆలయం, ఆర్‌సీఎం చర్చిలో ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రాజధానులను టీడీపీ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ఎన్ని కుట్రలు చేసినా మూడు రాజధానుల ఏర్పాటు ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, ఎంపీపీ ఉషారాణి, పార్టీ సీనియర్ నాయకులు శెట్టి అప్పాలు, రఘునాథ్,సాంబ,సర్పంచ్ సుష్మిత, పుష్ప పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ హుకుంపేటలోని దుర్గాదేవి మండపంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఒక రాజధాని వద్దు...మూడు రాజధానులు ముద్దు అంటూ నాయకులు నినాదాలు చేశారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం పాల్గొన్నారు.

సంకల్పం నెరవేరాలి

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు సమగ్రంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్‌జగన్ తలపెట్టిన మూడు రాజధానుల సంకల్పం నెరవేరాలని కోరుకుంటూ అడ్డతీగల దేవీ ఆలయంలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు రాజధానులకు అన్ని వర్గాల ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొడ్డపాటి రాఘవ,అడ్డతీగల సొసైటీ అధ్యక్షుడు తోట రాజేశ్వరరావు,వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు సామిదాల రాజారమేష్,ఎంపీటీసీ వడ్లమూరి రత్నం,అడ్డతీగల సర్పంచ్ ప్వప్పుల చిట్టమ్మ తదితరులు పాల్గొన్నారు. మూడు రాజధానులకు మద్దతుగా పెదబయలు మోదకొండమ్మ ఆలయంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వంతాల ఆనందరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. సీనియర్ నాయకులు గంపరాయి సూరయ్య, మాజీ సర్పంచ్ పాంగి సింహాచలం,నాయకులు రాధాకృష్ణ, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. గంగవరం మండలం మర్రిపాలెంలోని అమ్మవారి ఆలయంలో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పూజలు చేశారు. మర్రిపాలెం సర్పంచ్ మడకం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న జమ్మివేట ఉత్సవం



శమీదళాలను కోస్తున్న అర్చకులు

సింహాచలం: విజయదశమిని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనసింహస్వామి జమ్మివేట ఉత్సవం వైభవంగా జరిగింది. కొండదిగువ పూలతోటలో జరగాల్సిన ఈ ఉత్సవాన్ని వర్షం కారణంగా సింహగిరిపైనే నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి రామాలంకారంలో ఆస్థానమండపంలో వేంజేంపచేశారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, షోడశోపచార పూజలు, వేద పారాయణాలు, పంచసూక్త పారాయణాలను నిర్వహించారు. సింహగిరి పైనే నృసింహమండపంలో ఉన్న శమీ వృక్షం చెంత విశేష పూజలు నిర్వహించారు. తదుపరి చెట్టుకున్న శమీ దళాలను కోసి ఆస్థానమండపంలో వేంజేసిన స్వామికి సమర్పించి, విశేషంగా అర్చన చేశారు. ఆలయ స్థానాచార్యులు టీపీ రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, చక్రవర్తి తదితరులు ఉత్సవాన్ని నిర్వహించారు.

మోసపోయాం.. న్యాయం చేయండి

మహిళా సమాఖ్య సభ్యుల ఆందోళన

చింతూరు: వెలుగు ఉద్యోగుల అక్రమాల కారణంగా నిండామునిగిన మహిళలు తమకు న్యాయం చేయాలంటూ ఆందోళన బాట పట్టారు. చింతూరు సర్పంచ్ కారం కన్నారావు ఆధ్వర్యంలో స్థానిక ఇందిరా క్రాంతిపథం కార్యాలయంతో పాటు ఐటీడీఏ ఎదుట గురువారం ధర్నా చేశారు.2018లో వెలుగు(ప్రస్తుతం వైఎస్సార్ క్రాంతిపథం)లో సీసీగా పనిచేసిన రవి, బుక్‌కీపర్‌గా పనిచేసిన కవిత తమను మోసం చేసి, తమ పేర్లపై అప్పులు తీసుకున్నారని, వారినుంచి తమ సొమ్ము రికవరీ చేయడంతో పాటు వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ వారు డిమాండ్ చేశారు.

జరిగిందేమిటంటే

గతంలో పనిచేసిన సీసీ రవి, బుక్‌కీపర్ కవితలు ఎర్రంపేట, అల్లిగూడెం, రత్నాపురానికి చెందిన 65 మంది మహిళా సమాఖ్య సభ్యుల నుంచి ఉన్నతి, స్త్రీనిధి, రివాల్వింగ్ ఫండ్, హ్యూమన్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద 30 లక్షలకు పైగా అక్రమంగా వసూలు చేసినట్టు బాధితులు తెలిపారు. బిస్కట్ల తయారీ పేరుతో తమ గ్రూపు పేరుపై రూ.4.50 లక్షలు డ్రాచేసి తమకు రూ.20 వేల చొప్పున మాత్రమే ఇచ్చి, మిగతా రూ.2.50 లక్షలు స్వాహా చేశారని రత్నాపురానికి చెందిన చంద్ర గ్రూపు సభ్యురాలు వంజం రత్తమ్మ తెలిపింది. తమకు ఇచ్చిన రూ.20 వేలకు సంబంధించి ప్రతినెలా బుక్‌కీపర్‌కు బకాయి సొమ్ము చెల్లించామని, ఆ సొమ్ము బ్యాంకులో కట్టకుండా కవిత సొంతానికి వాడుకున్నారని వాపోయింది. దీంతో ఇప్పటికీ తమ గ్రూపు రూ.4.50 లక్షలు బాకీ ఉన్నట్లు బ్యాంకు అధికారులు నోటీసులు పంపుతున్నారని ఆమె తెలిపింది. తమ పేర్లతో బ్యాంకుల్లో అప్పులు అలాగే ఉండడంతో మా గ్రూపులకు బ్యాంకులు కొత్తగా ఉన్నతి(టీఎస్‌పీ), స్త్రీనిధి అప్పులు ఇవ్వడంలేదని పలువురు తెలిపారు. ఈ విషయంపై గత ఐటీడీఏ పీవో ఆకుల వెంకటరమణకు ఫిర్యాదు చేయగా విచారణ చేసి బుక్‌కీపర్ కవితను ఉద్యోగం నుంచి తొలగించారని, సీసీ రవిని సస్పెండ్ చేశారని, కానీ వారి వద్దనుంచి సొమ్ము మాత్రం రికవరీ చేయలేదని సర్పంచ్ కన్నారావు తెలిపారు.



బాధిత మహిళలతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రామశేషు

బాధితులకు న్యాయం చేస్తాం

బాధిత మహిళలు ఐటీడీఏ వద్ద ఆందోళన చేపట్టడంతో పీవో రామశేషు వారితో మాట్లాడి విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీనిపై పూర్తిస్థాయి విచారణకు ఓ కమిటీని ఏర్పాటు చేయాలని డీఆర్‌డీఏ పీడీ మురళీకి సూచించారు. కమిటీ నివేదిక అంశాల ఆధారంగా శాఖాపరంగా పోలీసులకు ఫిర్యాదు చేస్తామని పీవో తెలిపారు. సొమ్ము రికవరీ అయ్యేంతవరకు బాధితులను ఇబ్బంది పెట్టవద్దని వైఎస్సార్ క్రాంతిపథం సిబ్బంది, బ్యాంకు అధికారులకు ఆయన ఆదేశించారు.

ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలు త్వరితగతిన పూర్తి

పలు కార్యక్రమాలపై ఉన్నతాధికారుల వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఇతర అధికారులు

సాక్షి,పాడేరు: జిల్లాలో అమలు చేసే పలు కార్యక్రమాలకు సంబంధించి ఉన్నతాధికారులు గురువారం వేర్వేరుగా వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా జిల్లాలో చేపడుతున్న ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణాలన్నింటినీ త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది ఆదేశించారు. అభివృద్ధి పనులకు సంబంధించి కలెక్టర్ సుమిత్ కుమార్‌తో ఆయన వీడియో కాన్ఫరెన్స్ జరిపారు. రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, ఉపాధి హామీ కాంపోనెంట్ నిధులతో చేపడుతున్న పనుల పురోగతిపై ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేదికి కలెక్టర్ సుమిత్ కుమార్ సమగ్రంగా వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాస్, డీఆర్‌వో బి.దయానిధి తదితరులు పాల్గొన్నారు.

భూ హక్కు..భూ రక్ష పత్రాలపై సమీక్ష :జిల్లాలోని జగనన్న భూ హక్కుభూ రక్ష పత్రాల జారీకి సంబంధించి భూ పరిపాలన విభాగం ప్రధాన కార్యదర్శి, ప్రత్యేక ముఖ్యకార్యదర్శి జి.సాయి ప్రసాద్ కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో వీడియో సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా భూముల రీ సర్వే వివరాలను కలెక్టర్ వివరించారు.

బల్క్ మిల్క్ కూలింగ్ కేంద్రాల ఏర్పాటుపై..

జిల్లాలోని బల్క్ మిల్క్ కూలింగ్ కేంద్రాలు, ఆటోమేటిక్ మిల్క్ కలెక్షన్ యూనిట్ల నిర్మాణాలపై సహకార శాఖ కమిషనర్ అహ్మదబాబు కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో సమీక్షించారు. జిల్లాలోని ఈ యూనిట్ల నిర్మాణాలకు సంబంధించి సమాచారాన్ని కలెక్టర్ వివరించారు.

ఆటో అదుపు తప్పి బోల్తా

నలుగురికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులు

ఎటపాక: అప్పటి వరకు తమ ఇష్టదైవానికి పూజలు చేసి ఆనందంగా ఇంటికి తిరుగుపయనమయ్యారు. ఇంతలోనే ప్రమాదానికి గురవడంతో ఆ గిరిజనుల రోదన మిన్నంటింది. చింతూరు మండలం కుయుగూరు గ్రామానికి చెందిన 20 మంది దసరా పండగ రోజు బుధవారం ఆటోలో ఎటపాక మండలం నల్లకుంట పంచాయతీలోని తెల్లంవారిగుంపులోని ఓ గుడికి వచ్చారు. అక్కడ మొక్కులు చెల్లించుకుని భోజనాలు చేసి వారి గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. గుడి నుండి కొద్దిదూరం వెళ్లగానే కృష్ణవరం సమీపంలోని రహదారి మలుపు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలోని ప్రయాణికులు ఒకరిపై ఒకరు చెల్లాచెదురుగా పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు ప్రమాదస్థలానికి వచ్చి వారిని ఆటోలో సమీపంలోని గౌరిదేవిపేట పీహెచ్‌సీకి తరలించారు. గాయపడ్డ వారిలో జెల్లి వెంకటేష్‌కు కాలు విరగగా, మడకం సోమమ్మకు చేయి విరిగింది. మరో ఇద్దరు మడకం రంగమ్మ, మడకం తరుపతమ్మలకు తలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరికి ప్రథమ చికిత్స అనంతరం 108 వాహనంలో భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఆటో ప్రమాదానికి డ్రైవర్ మద్యం సేవించి ఆటో నడపడమే కారణమని తెలిసింది.

కారును ఢీకొన్న బస్సు

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం


అదుపు తప్పి పొలాల్లోకి దుసుకు పోయిన బస్సు

చింతపల్లి: మండలంలోని చిట్రాలగొప్పు వద్ద ఆర్టీసీ బస్సు కారును ఢీకొని పొలాల్లోకి దూసుకు పోయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. నర్సీపట్నం నుంచి చింతపల్లి వస్తున్న కారును ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు తప్పించబోయే క్రమంలో ఢీ కొని, సమీపంలోని పొలాల్లోకి దూసుకుపోయింది. ప్రమాద సమయంలో బస్సులో 50 మంది ప్రయాణికులు ఉన్నారు. వారితో పాటు కారులో ప్రయాణిస్తున్న వారికి కూడా ఎటువంటి ప్రమాదం జరగలేదు.

యువకుడి అనుమానాస్పద మృతి


రాంప్రకాష్ మృతదేహం వద్ద పోలీసులు, బంధువులు


రాంప్రకాష్(ఫైల్)

రావికమతం: టి.అర్జాపురం గ్రామానికి చెందిన యువకుడు మడగల రాంప్రకాష్(19) మృతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కొత్తకోట ఎస్‌ఐ విభీషణరావు గురువారం తెలిపారు. ఆయన కథనం మేరకు టి.అర్జాపురం గ్రామానికి చెందిన మడగల రాంప్రకాష్ అతని మిత్రులు మత్స రామునాయుడు, మత్స చిరంజీవి, శ్రీను, విజయరావుతో దసరా సందర్భంగా అక్కడికి సమీపంలోని ఒక మామిడి తోటలో పార్టీ చేసుకున్నారు. అయితే సాయంత్రం తిరిగి వస్తూ దారిలో రాంప్రకాష్ బండి నిలిపి స్టాండ్ వేసి ఒక్కసారిగా సొమ్మసిల్లి పడిపోయాడని, మిత్రులు ప్రశ్నించగా ఊపిరి అందడం లేదని చెప్పారని అన్నారు. అయితే చికిత్స నిమిత్తం నర్సీపట్నం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడన్నారు. దీనిపై రాంప్రసాద్ కుటుంబీకులు బుధవారం రాత్రి ఫిర్యాదు చేశారన్నారు. ఈమేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలు తెలియజేస్తామన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం


వైద్య శిబిరానికి వచ్చిన గ్రామస్తులు


మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

జి.మాడుగుల: ఏజెన్సీ గిరిజన గ్రామాల్లో పోలీసు శాఖ అందిస్తున్న సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. మండలంలో లువ్వాసింగి పంచాయతీ అలగాం గ్రామంలో గురువారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని, వ్యసనాల బారిన పడొద్దని సూచించారు. గిరిజన యువత ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా క్రీడల పట్ల దృష్టి సారించి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. గిరిజన నిరుద్యోగులకు విద్యార్హతలు బట్టి పోలీస్‌శాఖ అధ్వర్యంలో శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తోందన్నారు. గిరిజన రైతులు గంజాయి సాగుకు దూరంగా ఉండాలని, వాణిజ్య పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న విత్తనాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. గిరిజనుల ఆరోగ్య పరిరక్షణపై దృష్టి సారించి, గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటుచేస్తున్నట్టు చెప్పారు. శిబిరంలో లువ్వాసింగి, కిల్లంకోట, కుడుముసారి పంచాయతీలకు చెందిన 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశాఖపట్నం గాయత్రి ఆస్పత్రి, జి.మాడుగుల పీహెచ్‌సీకి చెందిన వైద్యులు, సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత


సీహెచ్‌సీ ఆవరణలో చెత్తను తొలగిస్తున్న సీఆర్‌పీఎఫ్ పోలీసులు

ముంచంగిపుట్టు: పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ గుర్తించాలని సీఆర్‌పీఎఫ్ ఈ–198 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రాజ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని సీహెచ్‌సీ ఆవరణలో గురువారం సీఆర్‌పీఎఫ్ పోలీసులు స్వచ్ఛతా అభియాన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సీహెచ్‌సీ ఆవరణలో చెత్తను తొలగించారు. జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని, చెత్త కుండీలు వినియోగించాలని, కాలువలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో గిరిజన గ్రామాల్లో సామాజిక సేవ కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టి, స్థానికులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. బెటాలియన్ సీఆర్‌పీఎఫ్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో పురుగు మందు తాగాడు..

అనకాపల్లిటౌన్: మద్యం మత్తులో పురుగు మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్టు రూరల్ ఎస్‌ఐ నర్సింగరావు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలో అక్కిరెడ్డిపాలెం పంచాయతీ మెట్టమీదకాలనీకి చెందిన గొల్లవిల్లి చిన్నారావు(38) దసరా పండగ నేపథ్యంలో బుధవారం పూటుగా మద్యం తాగిన మత్తులో పురుగుమందు సేవించాడు. కుటుంబసభ్యులు అతన్ని స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఈమేరకు మృతుడి భార్య ధనలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

ప్రమాదవశాత్తూ వివాహిత మృతి

డుంబ్రిగుడ: మండలంలోని అరమ పంచాయతీ తుంబ్రుంగుగ గ్రామానికి చెందిన తాంగుల జానకి (39) ప్రమాదవశాత్తూ మృతి చెందింది. డుంబ్రిగుడ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ అందించిన వివరాలివి. గ్రామ సమీపంలో గల పొలంలో పనులకు వెళ్లిన జానకి తిరిగి వస్తుండగా పక్కనే ఉన్న చెరువులో కాలు జారి పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేక పోవడంతో బయటకు రాలేక అక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ విషయంపై పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అరకులోయ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించినట్టు ఎస్‌ఐ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ మద్యం స్వాధీనం


మద్యం బాటిళ్లతో పట్టుబడిన వ్యక్తితో ఎస్‌ఐ ప్రసాదరావు

ఎస్.రాయవరం: బంగారమ్మపాలెంలో బెల్టు షాపుపై దాడి చేసి వ్యక్తిని అదుపులోనికి తీసుకున్నట్టు ఎస్‌ఐ ప్రసాదరావు తెలిపారు. దసరా పండగ పూట గ్రామానికి చెందిన వ్యక్తి బీరు, ఇతర మద్యం సీసాలు భద్రపరచుకుని విక్రయిస్తున్నట్టు సమాచారం రావడంతో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో 8 బీరు బాటిళ్లు, 9 క్వార్టర్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. కేసు నమోదు చేశామన్నారు.

11 అడుగుల కొండచిలువ హతం


హతమైన కొండచిలువ

రోలుగుంట: మండలంలోని కొండపాలెం గ్రామంలో 11 అడుగుల కొండ చిలువ గ్రామస్తుల చేతిలో గురువారం హతమైంది. గ్రామానికి చెందిన బంగారు శివ ఇంట్లో దూలానికి చుట్టుకొని ఉన్న కొండ చిలువ గురువారం ఉదయం ఇంటి యజమానికి కనిపించింది. దీంతో అతను ఆందోళనతో పొరుగు వారికి తెలియజేయడంతో బంటు లోకేస్ తన స్నేహితులతో కలసి ఇక్కడకు వచ్చి కొండ చిలువను సాహసంతో బయటకు తీసి హతం చేశారు.

రోడ్డు ప్రమాదంలో అరటి పండ్ల వ్యాపారి మృతి


శ్రీనివాసరావు (ఫైల్)

ఎస్.రాయవరం: అడ్డురోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఎస్.రాయవరం ఎస్‌ఐ ప్రసాదరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. గెడ్డపాలెం గ్రామానికి చెందిన దాడిశెట్టి శ్రీనివాసరావు (47) అడ్డురోడ్డులో అరటి పండ్ల వ్యాపారం ముగించుకుని బుధవారం సాయంత్రం ఇంటికి వెళుతుండగా ఈ ప్రమాదానికి గురయ్యారు. అడ్డురోడ్డు శివారులో ఫ్లై ఓవర్ సమీపంలో తుని నుంచి యలమంచిలి వైపు వెళుతున్న వాహనం ఢీకొట్టింది. ఈ ఘటలో శ్రీనివాసరావు అక్కడిక్కడే మృతి చెందినట్టు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

గంజాయితో ఇద్దరి అరెస్ట్

మర్రిపాలెం(విశాఖ ఉత్తర): విశాఖపట్నం రైల్వేస్టేషన్ జ్ఞానాపురం వైపు గల పార్కింగ్ ప్రదేశం వద్ద గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలివీ.. విశ్వసనీయ సమాచారం ప్రకారం సెబ్ పోలీసులు రైల్వేస్టేషన్ జ్ఞానాపురం పార్కింగ్ వైపు గల 4 నంబర్ గేట్ వద్ద ప్రయాణికుల లగేజీలను తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో బిహార్‌కు చెందిన మిథున్‌కుమార్, మైనర్ వద్ద 11.5 కిలోల ఎండు గంజాయిని గుర్తించారు. వీరి నుంచి గంజాయితో, 2 ఆండ్రాయిడ్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పాడువా(ఒడిశా) నుంచి పాట్నాకు ఈ గంజాయిని తరలిస్తున్నట్లు విచారణలో తేలిందని ఎస్‌ఈబీ సిబ్బంది తెలిపారు. ఇదే కేసులో ప్రధాన నిందితుడు మున్నా యాదవ్‌ను అరెస్టు చేయాల్సి ఉంది. ఈ సోదాల్లో ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్‌వీఎస్ ప్రసాద్, ఎస్‌ఐ పి.శాంతిలక్ష్మి, ఇతర సెబ్, ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

పీఎంపాలెం(భీమిలి): పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో విజయదశమి రోజున పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించి సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలివీ.. మిథిలాపురి వుడా కాలనీలోని ఓ గృహంలో బుధవారం పేకాట ఆడుతున్నట్లు టాస్క్‌ఫోర్స్‌కు పక్కా సమాచారం అందడంతో.. ఆ గృహంపై పోలీసులు దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకుని.. వారి నుంచి రూ.43,490, 2 బైకులు 2 కార్లు, 5 సెల్‌ఫోన్లు, 101 ప్లాస్టిక్ కాయిన్లను స్వాధీనం చేసుకున్నారు.

శక్తి స్వరూపిణికి బోనాల నివేదన



వై.రామవరం: మండలంలోని వై.రామవరం, పి.యర్రగొండ, పనసలపాలెం, చవిటిదిబ్బలు, దేవరమడుగులు గ్రామాల కనకదుర్గమ్మ ఆలయాల్లోను, సరిహద్దు ప్రాంతమైన వెదురునగరం గ్రామ శ్రీసాయిరామ్ గురుస్వామి ఆశ్రమంలోని కాళీమాత ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చవిటిదిబ్బలు కనకదుర్గమ్మవారికి గురువారం వందమందికిపైగా మహిళలు బోనాలు సమర్పించారు. పలు గ్రామాల్లో అమ్మవారిని బోనాలతో ఊరేగించి, దేవరమడుగులు, సరిహద్దు ప్రాంతమైన వెదురునగరం పెద్దేరువాగులో నిమజ్జనం చేశారు.

అల్లూరి పోరాట ప్రాంతాలు అభివృద్ధి చేయాలి


సీఐ రాంబాబుకి అల్లూరి చిత్రపటాన్ని బహుకరిస్తున్న వీరభద్రరావు తదితరులు

అడ్డతీగల: స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పోరాట ప్రాంతాలను అభివృద్ధి చేయాలని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు అన్నారు. ఆయన ఇతర సంఘ సభ్యులతో కలిసి అడ్డతీగలలోని నాడు అల్లూరి సీతారామరాజు దాడిచేసిన పోలీస్‌స్టేషన్‌ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు అల్లూరి దాడిచేసిన పాత పోలీస్‌స్టేషన్ పరిధిలో ఖాళీగా ఉన్న స్థలంతోపాటు, ఆయన పోరాటానికి ప్రధాన కేంద్రమైన పైడిపుట్ట గ్రామం, అల్లూరి తపస్సు చేసిన తపస్వికొండ, మల్లవరంమామిళ్ళ వద్ద తేనెల మంగి తదితర ప్రాంతాలను అభివృద్ధి చేసి పర్యాటక ప్రదేశాలుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ సందర్భంగా సీఐ వై.రాంబాబుకి అల్లూరి చిత్రపటాన్ని బహుకరించారు. అల్లూరి దాడిచేసిన నాటి పోలీస్‌స్టేషన్ అభివృద్ధిపై సీఐతో చర్చించారు. ఎస్‌ఐ అప్పలరాజు, పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకుడు వెంకటరామయ్య, అల్లూరి యువజన సంఘం సభ్యులు సత్తిబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి బస్సు కింద పడిన బైక్

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం


పెదగార్లపాడు- చినగార్లపాడు మధ్య జరిగిన ప్రమాదంలో ఆర్టీసీ బస్సు కింద బైక్

గంగవరం: బైక్ అదుపు తప్పడంతో బైక్ మీద వెళ్తున్న వ్యక్తి దూకేయడంతో ఆర్టీసీ బస్సు కిందికి బైకు దూసుకెళ్లింది. అయితే ఈ ఘటనలో ఆర్టీసీ బస్సుకు ప్రమాదం తప్పింది. గురువారం గంగవరం మండలం పెదగార్లపాడు– చినగార్లపాడు మధ్యలో ఈ సంఘటన జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. అడ్డతీగల వైపు నుంచి గోకవరం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా బైక్‌పై వెళ్తున్న వ్యక్తి ఆ బైక్ అదుపు తప్పడంతో బైక్ నుండి దూకేశాడు. దీంతో బైక్ బస్సు కింద పడింది. గోకవరం ఆర్టీసీ డిపోకి చెందిన బస్సు డ్రైవర్ చాకచక్యంగా బస్సును అదుపు చేయడంతో ప్రయాణికులు సురక్షితంగా ప్రమాదం నుంచి బయటపడ్డారు. బస్సును రోడ్డు మార్జిన్ దింపేయడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే బస్సు, బైక్ దెబ్బతిన్నాయి. బస్సులో ఉన్నవారికి, బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తికి ఏవిధమైన గాయాలు తగలకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. గ్రామస్తుల సహకారంతో బస్సును బయటకు తీశారు. దీనిపై ఎస్‌ఐ చినబాబును వివరణ కోరగా ప్రమాదంపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

ఆటోలో 210 కిలోల గంజాయి రవాణా

ఏడుగురి అరెస్టు


జి.మాడుగులలో గంజాయి నిందితులతో పోలీసులు

జి.మాడుగుల: మండలంలో లువ్వాసింగి పంచాయతీ వంచేబు రోడ్డు మార్గంలో ఆటోలో ఏడుగురు వ్యక్తులు గంజాయి మూటలను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. స్థానిక సీఐ సత్యనారాయణ అందించిన వివరాలిలా ఉన్నాయి. వంచేబు గ్రామం వద్ద మంగళవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా వంజుబు గ్రామానికి చెందిన సాగేని మత్స్యరాజు, కోరాబు భీమన్నపడాల్, కోరాబు దేవుడు, దూరు క్రాంతికుమార్‌తో పాటు మరో ముగ్గురు మైనర్లు కలసి ఆటోలో 210 కిలోల గంజాయి మూటలను తరలిస్తూ పట్టుబడ్డారు. దీంతోగంజాయి స్వాధీనం చేసుకుని, ఆటోను సీజ్ చేశామని, నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

రెండు మేకలపై పులిదాడి



పులిదాడిలో హతమైన మేకను పరిశీలిస్తున్న అటవీశాఖ సిబ్బంది, గొండుపాలెం ప్రాంతంలో పులి పాదముద్రలు

కె.కోటపాడు: కింతాడ శివారు గొల్లలపాలెం గ్రామ సమీపంలో గల కొండకు మేతకు తీసుకువెళ్ళిన రెండు మేకలపై పులిదాడికి పాల్పడింది. గ్రామానికి చెందిన పల్లా రామునాయుడు బుధవారం సాయింత్రం గ్రామాన్ని ఆనుకొని ఉన్న కొండకు మేకలను మేతకు తీసుకువెళ్ళాడు. రైతు మేకలను విడిచిపెట్టి గ్రామంలోనికి వచ్చి చూడగా ఒక మేక మెడ నుండి రక్తస్రావం జరిగి ఉండడాన్ని రైతు రామునాయుడు గుర్తించాడు. మేక పడి ఉన్న ప్రాంతంలో పులి పాదముద్రలను చూసిన రామునాయుడు మేకపై పులి దాడికి పాల్పడినట్లు నిర్ధారించుకున్నాడు. మరో మేకను ఎంత వెతికినా కనిపించలేదు. దీంతో పులి ఎత్తుకెళ్లి ఉంటుందని భావించి ఈ సమాచారాన్ని గ్రామ సర్పంచ్ బండారు ఈశ్వరమ్మకు తెలపడంతో ఆమె అటవీశాఖాధికారులకు సమాచారాన్ని అందించారు. గొల్లలపాలెం గ్రామానికి గురువారం వచ్చిన అటవీశాఖ సిబ్బంది ఆర్.వసంత పులిదాడిలో హతమైన మేకను పరిశీలించారు. పులి సంచారం కారణంగా పరిసర గ్రామాల్లో రైతులు పశువులను కొండ ప్రాంతాలకు మేతకు తీసుకువెళ్లరాదని సూచించారు. గత బుధవారం తెల్లవారుజామున మండలంలో గొండుపాలెం గ్రామంలో గల కొండ ప్రాంతంలో పులి పాదముద్రలను గ్రామస్తులు గుర్తించారు. పులి సంచారంతో నల్లకొండ రిజర్వ్ ఫారెస్ట్ పరిసర గ్రామాల్లో ప్రజలు పులి బారిన పడి ఎటువంటి నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కారు బోల్తా


సంగం గెడ్డ వద్ద బోల్తా పడిన కారు

జి.మాడుగుల: పాడేరుకు వెళ్లే రోడ్డులో మత్స్యపురం గ్రామ సమీపంలో సంగం గెడ్డ బ్రిడ్జి వద్ద గురువారం రాత్రి ఓ కారు బోల్తా పడింది. వాహనంలో సాంకేతిక లోపం వల్ల ఈ ప్రమాదం జరిగినట్టు తెలిసింది. కారులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయటపడినట్టు సమాచారం.

క్లుప్తంగా

దైవభక్తితోనే సన్మార్గం



ప్రార్థన చేస్తున్న పాస్టర్లు

అరకులోయ రూరల్: దైవ భక్తితోనే సన్మార్గంలో ప్రయాణించవచ్చని లూథరన్ మిషన్ డైరెక్టర్ సంజీవ్‌కుమార్ అన్నారు. మాడగడ పంచాయతీ బెంజిపూర్ లూథరన్ చర్చి ఆవరణలో పాస్టర్ల సదస్సు గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవ మార్గాన్ని అనుసరించాలన్నారు. గ్రామాల్లో పరిచర్య కార్యక్రమలు నిర్వహించి, ప్రజలు మంచి మార్గంలో ప్రయణించేలా చైతన్యం తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు అబ్రహం, జీసుచరణ్, శామ్యూల్, జీవన్‌కుమార్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్ట



పూజలు చేస్తున్న చిన్నారులు

రాజవొమ్మంగి: స్థానిక షిర్డీసాయిబాబా ఆలయ ప్రాంగణంలో బుధవారం సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. పురోహితులు భానుమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో చిన్నారులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన జరిగింది.

వరద బాధితులకు వితరణ



వరద బాధితులకు బియ్యం అందజేస్తున్న నర్సయ్య

కూనవరం: ఇటీవల సంభవించిన గోదావరి వరదలకు నిరాశ్రయులైన 150 కుటుంబాలకు దాతలు నర్సయ్య, విజయలక్ష్మి దంపతులు గురువారం ఒక్కో కుటుంబానికి 5 కిలోల బియ్యం చొప్పున వితరణ ఇచ్చారు. బాధితులను ఆదుకునేందుకు తమ వంతు సాయం అందించినట్లు వారు చెప్పారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



కుట్టి గ్రామంలో బాలింతతో మాట్లాడుతున్న సీడీపీవో నీలిమ

దుంబ్రిగుడ: మండలంలోని రంగిలిసింగి, కుట్టి, జాకరవలస, దొర్రగుడ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సీడీపీవో నీలమ గురువారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. సక్రమంగా పౌష్టికాహారం అందజేయాలని సిబ్బందికి సూచించారు. కేంద్రాల్లో ఉన్న సమస్యలను తనకు తెలియజేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. అనంతరం బాలింతలు, గర్భిణులతో మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు.

గ్రామ సమస్యలపై ప్రణాళిక

ముంచంగిపుట్టు: లక్ష్మీపురంలో సర్పంచ్ కె.త్రినాథ్ అధ్యక్షతన గురువారం గ్రామసభ జరిగింది. పంచాయతీలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. సీసీ రోడ్డు,తాగునీరు, డ్రైనేజీలు నిర్మించాలని, సిల్వర్‌ఓక్, కాఫీ మొక్కలు అందజేయాలని తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ త్రినాథ్ మాట్లాడుతూ సమస్యలపై చర్చించి ప్రణాళికను రూపొందించామని, నిధులు మంజూరు చేయాలని కోరారు. ఉప సర్పంచ్ సత్యం, వైఎస్సార్‌సీపీ నాయకుడు సాధురాం, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రామాల్లో గడప గడపకు

పాడేరు రూరల్: వంజంగి పంచాయతీలో శుక్రవారం ఉదయం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్.కొత్తూరు, వై.కొత్తూరు, కల్లలుబయలు, పోతురాజుమెట్ట గ్రామాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

మారేడుమిల్లి : జియ్యంవలస, సున్నంపాడు గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొంటున్నట్టు పార్టీ వర్గీయులు ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

గిరిజనుల అభ్యున్నతికి పెద్దపీట

- పాడేరు, అరకు, రంపచోడవరం నియోజకవర్గాల్లోని గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం
- ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, నాగులపల్లి ధనలక్ష్మికి ఘన స్వాగతం



బొర్రమామిడిలో గిరిజనులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి



కొంతిలిలో స్థానికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



చికిలింతలో గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

సాక్షి,పాడేరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో గిరిజనుల అభ్యున్నతి జరుగుతోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి స్పష్టం చేశారు.వంజంగి పంచాయతీ దొడ్డిపల్లి, బొర్రమామిడి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గురువారం నిర్వహించారు. జోరువాన, ఈదురు గాలుల తీవ్రత ఉన్నప్పటికీ, ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి 168 గడపలను సందర్శించారు. ప్రతి ఇంటా ఎమ్మెల్యేకు గిరిజనులంతా ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి యోగక్షేమాలు, ప్రభుత్వ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా సమగ్ర అభివృద్ధి సాధ్యమైందని, పార్టీలకతీతంగా అర్హులందరికీ ప్రభుత్వం పథకాలు అమలు చేస్తోందన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పనులు విస్తృతంగా చేపడుతున్నామన్నారు. వంజంగి పంచాయతీలో రోడ్లు, తాగునీటి సమస్యలను సత్వర పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరిచి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి గిరిజనులంతా అండగా నిలవాలని కోరారు. సర్పంచ్ బొంజుబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షురాలు సరస్వతి, ఎంపీటీసీ సభ్యుడు రామకృష్ణ పాత్రుడు, మండల పార్టీ అధ్యక్షుడు రాంబాబు, ఉప సర్పంచ్ సత్యనారాయణ, వార్డుమెంబర్ రాజారావు, నాయకులు కన్నా పాత్రుడు, సుశీల, సింహాచలం, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ అభివృద్ధికి ప్రత్యేక కృషి: అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: గిరిజనుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని కొంతిలి పంచాయతీ కేంద్రంతో పాటు కె.ముంచింగిపుట్టు, గడ్డికాలనీ, పెంకింటికాలనీ గ్రామాల్లోని 339 గడపలను సందర్శించారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రహదారులు, తాగునీటి సమస్యపై పలువురు ఎమ్మెల్యేకు విన్నవించగా త్వరగా పరిష్కరిస్తామని ఆయన చెప్పారు. కొంతిలి గ్రామానికి చెందిన తాంగుల నాగం నాయుడు అనే దివ్యాంగుడిని ఆత్మీయంగా పలకరించారు. అతడికి ఆత్మస్థైర్యాన్ని ఇచ్చి, అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ఏజెన్సీ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విశేషంగా ప్రత్యేకంగా కృషి చేస్తున్నారన్నారు. ఆపదలో ఉన్న ప్రతీ ఒక్కరికి అన్ని వేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి చెట్టి వినయ్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు విశ్వేశ్వరరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండలరావు, సొసైటీ బ్యాంకు చైర్మన్ రామకృష్ణ, సర్పంచ్ చంటమ్మ, పార్టీ యువజన విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తిబాబు, మాజీ ఎంపీపీ రవిప్రసాద్, నాయకులు మత్స్యరాజు, శామ్యూల్, కోటిబాబు, సాయిప్రసాద్, భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగనన్న ధ్యేయం: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రాజవొమ్మంగి: గిరిజనులు అంతా సుఖసంతోషాలతో, అష్టఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ..అదే మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం అని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని చికిలింత, దుర్గానగర్, గగ్రంగి, కరుదేవపాలెం గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ధనలక్ష్మి పాల్గొన్నారు. భారీ వర్షం, ఈదురుగాలులు సైతం లెక్కచేయకుండా ఆయా గ్రామాల్లోని 250 గడపలను సందర్శించారు. ఆమెకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి ఆపాయ్యంగా పలకరించి, యోగక్షేమాలు, సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు రోడ్లు, డ్రైనేజీలు, మరుగుదొడ్లు, గృహాలు, ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాల కోసం ఎమ్మెల్యేకు విన్నవించారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే ఆయా గ్రామాల్లో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు అనేక పథకాలు అమలుచేస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మ్యుటేషన్ల ప్రక్రియ వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ధనలక్ష్మి స్థానిక తహసీల్దార్ సుబ్రహ్మణ్యాచారిని ఆదేశించారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులతో పంచాయతీల్లో సమస్యలను పరిష్కరించాలని కార్యదర్శులు, సర్పంచ్‌లకు సూచించారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్‌రాజు, సర్పంచ్‌లు సూరిబాబు, శుభలక్ష్మి, వెంకటలక్ష్మి, చంద్రుడు, ఆదిరాజు, మురళీకృష్ణ, మండల పార్టీ కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ, నాయకులు రవికుమార్, కుశరాజు, అర్జున్, నాని, జాన్‌బాబు, తహసీల్దార్ సుబ్రహ్మణ్యాచారి, ఎంపీడీవో బాపన్నదొర, ఎంఈఓ తాతబ్బాయిదొర, ఏఓ రామేష్‌నాయుడు, హౌసింగ్ ఏఈ చలపతి, ఏపీఎం ఆదినారాయణ, ఏపీఓ నాగరాజు, వీఆర్వో సూర్యకాంతం, సెక్రటరీ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మిన్నంటిన దసరా ఉత్సవాలు



చింతపల్లిలో అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

- దుర్గాదేవికి ప్రత్యేక పూజలు
- ఘనంగా విగ్రహాల నిమజ్జనం



టేకులబోరులో అమ్మవారికి పూజలు



రాజవొమ్మంగిలో దుర్గమ్మకు పూజలు చేస్తున్న భక్తులు



పాడేరులో ప్రత్యేకాలంకరణలో దుర్గాదేవి



ముంచంగిపుట్టులో దుర్గమ్మకు పూజలు చేస్తున్న భక్తులు



అడ్డతీగలలోని పవనగిరి క్షేత్రంలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

సాక్షి, పాడేరు : విజయదశమి వేడుకను పురస్కరించుకొని దుర్గమ్మ తల్లికి బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అల్లూరి జిల్లా వ్యాప్తంగా దసరా ఉత్సవాలు మిన్నంటాయి. అన్ని ప్రాంతాల్లో పండగను ఘనంగా జరుపుకున్నారు.ఆలయాల్లో కనకదుర్గమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దేవాలయాలు భక్తులతో కళకళలాడాయి. ఇళ్లల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వాహన, ఆయుధ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. ప్రసాద పంపిణీ చేపట్టారు. థింసా నృత్యాలు, పలు వేషాలతో పాటు, బాణ సంచా, తీన్‌మార్ డప్పు వాయిద్యాల నడుమ దుర్గమ్మ విగ్రహాలను సమీపంలోని గెడ్డలు, వాగుల్లో నిమజ్జనం చేశారు.

ముంచంగిపుట్టు : మోటార్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అమ్మవారి విగ్రహాన్ని సమీప గెడ్డలో నిమజ్జనం చేశారు.

పెదబయలు: హరిహరపుత్ర మోద మోటార్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని మత్స్యగెడ్డలో నిమజ్జనం చేశారు.

జి.మాడుగుల: తహసీలాఫీస్ కార్యాలయం సమీపంలో ఏర్పాటుచేసిన దుర్గాదేవి విగ్రహాన్ని ఈదులబయలు గెడ్డలో నిమజ్జనం చేశారు.

చింతపల్లి రూరల్: మండల కేంద్రంలో దసర ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. దుర్గాదేవి విగ్రహన్ని సమీపంలోని గెడ్డలో నిమజ్జనం చేశారు.

కొయ్యూరు: సింగవరం దుర్గమ్మ ఆలయంలో భక్తులు సారెను అమ్మవారికి అందజేశారు. భవానీ మాలధారణ భక్తులు ఆలయంలో ఇరుముళ్లు వేసుకుని ఇంద్రకీలాద్రికి పయనమయ్యారు.

అడ్డతీగల: పవనగిరి క్షేత్రంలో వేంచేసిన గిరి దుర్గాభవానీ ఆలయంలో కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వ్యవస్థాపకులు వెంకటరామయ్య ఆధ్వర్యంలో రాజరాజేశ్వరి అలంకరణలో అమ్మవారికి పూజలు చేశారు. షిర్డీ సాయినాథుని పుణ్యతిథిని పురస్కరించుకుని సాయిబాబా విగ్రహానికి పూజలు నిర్వహించారు.

గంగవరం : స్థానిక శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. అమ్మవారి విగ్రహాన్ని పైడిపుట్ట పెద్దేరు వాగులో నిమజ్జనం చేశారు.

రాజవొమ్మంగి: మండలంలోని దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. ఆచార సంప్రదాయాల్లో భాగంగా పోలీస్‌స్టేషన్లు, విద్యుత్ కార్యాలయాల్లో ఆయుధ పూజలు చేశారు.

కూనవరం: శబరిగోదావరి సంగమ స్థానంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి దుర్గాదేవీ అమ్మవారికి పసుపు కుంకుమార్చన పూజలు నిర్వహించారు. సాయంత్రయ జమ్మిచెట్టు వద్ద ప్రదర్శనలు నిర్వహించి శమి పూజలు చేశారు. అమ్మవారి ఊరేగింపు కనుల పండువగా జరిగింది.



పెదబయలులో దుర్గాదేవిని ఊరేగిస్తున్న భక్తులు



జి.మాడుగులలోని అమ్మవారి విగ్రహ ఊరేగింపులో కోలాటం



ఊరేగింపులో భవానీ మాలధారులు



గంగవరంలో అమ్మవారి ఊరేగింపులో భక్తులు

ఆదివాసీల అభ్యున్నతికి కృషి



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

ఎటపాక: పురుషోత్తపట్నం పంచాయతీ శ్రీరాంనగర్‌కాలనీలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ కార్యాలయాన్ని పరిషత్ జాతీయ అధ్యక్షుడు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ గురువారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఆదివాసీల అభ్యున్నతికి విశేష కృషి చేస్తున్నామన్నారు. భద్రాద్రి దేవస్థానం భూములను కొందరు గిరిజనేతరులు ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. యంత్రాంగం స్పందించి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ముందుగా కొమ్ము నృత్యాలతో భారీ ర్యాలీ నిర్వహించి, ఆదివాసీ పరిషత్ జెండా ఆవిష్కరించారు. నాయకులు నెహ్రూ, శంకర్, రమేష్, పుల్లయ్య, వెంకటేశ్వర్లు, శ్రీను, జోగారావు, శ్రీను, బాలరాజు తదితరులున్నారు.

గ్రామాల్లో ఉపాధి పనుల గుర్తింపు



మాట్లాడుతున్న ఎంపీపీ కృష్ణారెడ్డి

గంగవరం: ఉపాధి పనుల గుర్తింపునకు సర్పంచ్ అక్కమ్మ అధ్యక్షతన గురువారం గ్రామసభ నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే పనులు గుర్తించాలన్నారు. గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించి, వలసలను తగ్గించాలన్నారు. ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి ఏపీఓ సంధ్యారాణి పాల్గొన్నారు.

పుష్కలంగా నిధులు.. శరవేగంగా పనులు

- జోరందుకున్న గ్రామ సచివాలయాల నిర్మాణం
- నాలుగు గ్రామ సచివాలయాల రెండో శ్లాబ్ పనులు పూర్తి
- కిముడుపల్లి, గోమంగి, బొండాపల్లిలో భవనాలు 95 శాతం పనులు



ఫెన్సింగ్ స్థాయిలో ఉన్న కిముడుపల్లి గ్రామ సచివాలయ భవనం

పెదబయలు: గ్రామ స్వరాజ్యం దిశగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ ప్రజలకు ఎంతో మేలు చేస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పంతో చేపట్టిన గ్రామ సచివాలయ ద్వారా ప్రజల చెంతకే పాలన వచ్చింది. సకాలంలో సంక్షేమ పథకాలు అందుతున్నాయి. మండలంలోని 16 గ్రామ సచివాలయాల ఏర్పాటుకు ప్రభుత్వం నూతన భవనాలు మంజూరు చేసింది. శివారు గ్రామాల్లో సైతం పనులు చివరి దశకు చేరుకున్నాయి. కిముడుపల్లి, బొండాపల్లి, గోమంగి గ్రామాల్లో భవనాల పనులు 95 శాతం పూర్తయ్యాయి. అడుగులపుట్టు, గంపరాయి, పద్రెడ, లింగేటి భవనాల రెండు శ్లాబుల పనులు పూర్తి కాగా, పెదకోడాపల్లి అరడకోట, సీకరి, కుంతుర్ల, సీతగుంట భవనాల ఒక శ్లాబ్ పనులు చేపట్టారు. సరైన రోడ్డు సదుపాయం లేని ఇంజరి, గిన్నెలకోట, జామిగుడ పంచాయతీల్లో సైతం పనులు ప్రారంభమయ్యాయి. ఏజెన్సీలో ఇటీవల కురుస్తున్న వర్షాలతో పనుల్లో కొంతమేర జాప్యం జరిగింది. గ్రామ సచివాలయాల భవనాలు పూర్తయితే మరింత చేరువగా ప్రభుత్వ సేవలు అందనున్నట్టు పలువురు చెబుతున్నారు. భవనాలు పూర్తి దశలో వస్తుండడంతో మండల వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

భవనాలు పూర్తయితే పాలన సౌలభ్యం



గ్రామ సచివాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణం వేగవంతంగా జరుగుతుంది. ఇప్పటికే మండలంలోని మూడు భవనాలు 95 శాతం పనులు పూర్తయ్యాయి. చిన్నపాటి పనులు పూర్తి చేసి ప్రారంభిస్తాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో సంకల్పంతో రూపుదాల్చిన గ్రామ సచివాలయాల ద్వారా పూర్తిస్థాయిలో సేవలు అందుతున్నాయి.

– వంతాల కాసులమ్మ, ఎంపీటీసీ, కిముడుపల్లి సెగ్మెంట్, పెదబయలు మండలం

95 శాతం పనులు పూర్తి



కిముడుపల్లి, గోమంగి, బొండాపల్లి గ్రామాల్లోని భవనాలు 95 శాతం పనులు పూర్తయ్యాయి. ఫెన్సింగ్ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. త్వరలో పనులు పూర్తి చేసి, కొద్ది రోజుల్లో భవనాలు ప్రారంభోత్సవం నిర్వహిస్తాం. గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ భవనాల కోసం ప్రభుత్వం రూ.79.30లక్షలు మంజూరు చేసింది. ఇటీవల సక్రమంగా రోడ్డు లేని ఇంజరి, గిన్నెలకోట సచివాలయాల్లో కూడా సచివాలయ భవన పనులు ప్రారంభించాం.

-సీహెచ్.సంజీవరావు, మండల ఇంజినీరింగ్ అధికారి, పెదబయలు మండలం

రుణ యాప్‌లతో అప్రమత్తం



శరభన్నపాలెంలో అవగాహన కల్పిస్తున్న సీఐ స్వామినాయుడు

కొయ్యూరు: శరభన్నపాలెంలో రుణయాప్‌ల వల్ల కలిగే ఇబ్బందులపై సీఐ స్వామినాయుడు గురువారం స్థానికులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రుణ యాప్‌లతో అప్రమత్తంగా ఉండాలన్నారు. కొందరు అవసరాల రీత్యా రుణయాప్‌ల ద్వారా సొమ్ము తీసుకొని చెల్లిస్తున్నా వేధింపులు ఆగడం లేదన్నారు. తీసుకున్న రుణానికి రెట్టింపు చెల్లించాలని లోన్ యాప్ నిర్వాహకులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అలాంటి సమయంలో తక్షణమే పోలీసులను సంప్రదించాలని కోరారు. కొందరు సైబర్ నేరగాళ్లు ఖాతాల నుంచి డబ్బులు కాజేసేందుకు బ్యాంకు నుంచి ఫోన్ చేసినట్టుగా ఆధార్ నంబర్ చెప్పాలని, ఓటీపీ చెప్పాలని, అడుగుతుంటారని, పొరపాటు బ్యాంకు ఖాతా వివరాలు వంటివి చెప్పకూడదని సూచించారు. ఇటువంటి సంఘటనల్లో బ్యాంకు ఖాతా నుంచి సొమ్ము కోల్పోయిన బాధితులు 1930 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. సర్పంచ్ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ , ఉపాధ్యాయులు చంద్రకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో రోడ్డు పనులకు అంతరాయం

అనంతగిరి: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నిమ్మలపాడు నుంచి కుంబర్తి మీదుగా పట్టి గ్రామం వరకు జరుగుతున్న రోడ్డు పనులకు అంతరాయం కలిగింది. రోడ్డు కోతకు గురైందని స్థానికులు చెబుతున్నారు. భారీ వర్షాలతో గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి.రాకపోకలు నిలిచాయి.